క్లుప్తంగా

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తు గడువు పెంపు

మిర్యాలగూడ : మిర్యాలగూడ డివిజన్‌లో ఖాళీగా ఉన్న 30 ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తు స్వీకరణ గడువు ఈనెల 25వరకు పొడిగించినట్లు సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే, వరి కోతల కారణంగా దరఖాస్తు చేసుకునే గడువు తేదీని ఈనెల 25 సాయంత్రం 5గంటల వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇకముందు ఎలాంటి గడువు పొడిగింపు ఉండదని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్ మాట్లాడుతూ ప్రతీ బూత్‌లో 200 సభ్యత్వాలు చేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతెం కర్ణాకర్, గంజి సత్యనారాయణ,మల్లారెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, అంజనేయులు తదితరులున్నారు.

బాలుడి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పసుపులేటి ఆంజనేయులు కుమారుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే ఉండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం దాతల సహకారం కోసం ఎదురు చూశారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు జమాల్‌పురి వంశీ ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన నారా లోకేష్ ఆర్థికంగా సాయం అందిస్తానని రిప్లై ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆస్పత్రికి రూ.2.50లక్షలు చెల్లించినట్లు పసుపులేటి ఆంజనేయులు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

నాగార్జునసాగర్ : జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు స్థానిక బీసీ గురుకుల విద్యాలయం విద్యార్థి అనిల్‌కుమార్ ఎంపికైనట్లు ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 15నుండి 17వరకు తెలంగాణలోని వికారాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్ మొదటి వారంలో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొననున్నట్లుగా ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. విద్యార్థిని సోమవారం విద్యాలయంలోని అధ్యాపకులు అభినందించారు.

25న హైదరాబాద్‌లో బీసీల సమరభేరి

మిర్యాలగూడ టౌన్ : చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీసీల సమరభేరిని విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, చిలకల మురళి యాదవ్, మహేశ్వరం నరేష్, సిద్దం రాజు, బోయిన ఉపేందర్, హరి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి : స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల తల్లిదండ్రుల కమిటీని సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ శౌరి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలె చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా కంబాలపల్లి రామకృష్ణ, జనరల్ సెక్రెటరిగా ధనమ్మ, ట్రెజరర్‌గా సురేష్, జాయింట్ సెక్రెటరిగా సాయికుమార్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌లుగా ముత్యాలు, ఆర్.యాదయ్య, కృష్ణవేణి, ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే నిరుపేద విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ తరి రాములు అన్నారు. సోమవారం మండలంలోని పోతునూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పెండ్యాల వెంకటేశ్వర్‌రావు టై, బెల్టులు, ఐడీ కార్డులను అందించిన కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ మహాసభల కరపత్రం ఆవిష్కరణ

దేవరకొండ : డిసెంబర్ 14,15తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో నిర్వహించనున్న యూఎస్‌ఎఫ్‌ఐ మొదటి అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కలమూరి పరశురాం పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ సాభాన్, తదితరులున్నారు.

యంత్రం కోత.. పశుగ్రాసం కొరత

- ఆయకట్టులో గడ్డి దొరకని పరిస్థితి
- యంత్రాల కోతతో ముక్కలు
- ఇబ్బంది పడుతున్న రైతులు



ముక్కలైన వరి గడ్డి

హాలియా : పశువులకు మేత మేసేందుకు గడ్డి దొరకని పరిస్థితి ఆయకట్టులో ఉంది. సాగు విస్తీర్ణం పెరిగిన, వరికోతకు యంత్రాలను వాడుతుండడంతో వరిగడ్డి దొరకడం లేదు. యంత్రాలతో వరి కోయడంతో గడ్డి ముక్కలు, ముక్కలుగా రావడంతో గడ్డి కట్టలు కట్టడానికి వీలుగా లేక రైతులు నిల్వ చేయలేకపోతున్నారు. కూలీల కొరతతో సాగర్ ఆయ కట్టులో వరికోతలు యంత్రాల వినియోగం కూడా గత ఐదు, ఆరేళ్లుగా పెరిగింది. వానాకాలం సీజన్‌లో సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల చేయడంతో ఆయకట్టులో విస్తారంగా వరి సాగు చేశారు. యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో నష్టం తగ్గి పంట పూర్తిస్థాయిలో చేతికందుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో వరికోతలు చేపట్టడంతో పశువులకు గడ్డి ఉండడం లేదు. కూలీలతో వరి కోతలు చేపడితే గడ్డి ఇబ్బడి ముబ్బడిగా ఉండేది. గడ్డి పెద్దగా పూర్తిగా వస్తుండటంతో పొడుగుగా ఉండటంతో నిల్వ ఉండేందుకు వీలుగా ఉండేది.

యంత్ర వినియోగం..

సాంప్రదాయ పద్ధతిలో కూలీలతో వరికోత కోయించి, ధాన్యం, గడ్డిని వేరు చేయడం వంటి తదితర సమస్యలు ఉండేవి. అయితే యంత్రాలతో వరిని కోయిస్తే ఒకేసారి పంట గట్టుకు చేరడంతో కోతకు యంత్రాలను వినియోగించడం పెరిగింది. చేతి కోతతో పంటను కోస్తే ధాన్యం చేతికి వచ్చే సరికి ఎక్కువ సమయం తీసుకోవడంతో రైతులు యంత్రాల వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో కోసిన వరి గడ్డి చిన్న చిన్న ముక్కలుగా రావడం, నలిగిపోతుండటంతో నిల్వకు పనికి రాకకుండా పోతుంది. దీంతో పంట పొలాల్లోనే రైతులు నిప్పు పెడుతున్నారు. దీంతో గడ్డి కొరత పెరిగిపోయింది. పశుగ్రాసం కొరతతో తప్పని పరిస్థితుల్లో ఆ గడ్డిని నిల్వ ఉంచుకునేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

గడ్డి ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే..

యంత్రాలతో కోసిన గడ్డిని నిల్వ ఉంచేందుకు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఏడాది పాటు నిల్వ ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు. పొలంలో ఉన్న గడ్డిని పనలుగా సేకరించి ఒక్కో పనను గట్టిగా కట్టాలి. అనంతరం ఆ పనలను ఒక ప్రాంతానికి చేర్చి గడ్డి మేటు వేయాలని చెబుతున్నారు. గడ్డి మేటు వేసే సమయంలో పై కప్పు ఏటవాలుగా ఉండేలా చేసుకొని, పైన టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ పట్టాలు వంటివి కప్పడం వల్ల వర్షాకాలం నీరు వెళ్లకుండా ఉండడంతో పాటు ఎక్కువ రోజులు గడ్డి నిల్వ ఉంటుందని పలువురు రైతులు సూచిస్తున్నారు.

గడ్డి దొరకడం లేదు



పశువులకు మేత మేసేందుకు గడ్డి దొరకని పరిస్థితి ఆయకట్టులో ఉంది. వరికోతకు యంత్రాలను వాడుతుండడంతో వరిగడ్డి దొరకడం కష్టంగా మారింది. ఆయకట్టులో వరి కోత యంత్రాలతో వరి కోయడంతో గడ్డి ముక్కలు, ముక్కలుగా రావడంతో గడ్డి కట్టలు కట్టడానికి వీలుగా లేక రైతులు నిల్వ చేయలేకపోతున్నారు. నాకున్న పాడిగేదెల మేత కోసం కట్ట గడ్డి రూ. 90లకు చొప్పున 400 కట్టలను కొనుగోలు చేశాను.

- లింగాల యశ్వంత్, రైతు, ఇబ్రహీంపేట

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన



క్రీడాకారుడు దేవేంద్రనాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్ బాలయోగి స్టేడియంలో నిర్వహించిన 38వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో దామరచర్ల మండల కేంద్రానికి చెందిన గోలి దేవేంద్రనాథ్ ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించాడు. దామరచర్ల మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న దేవేంద్రనాథ్ అండర్ 21కేజీల విభాగంలో తైక్వాండోలో మంచి ప్రతిభ కనబరిచి కాంస్యం గెలుపొందడంపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్‌-3 పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

మిర్యాలగూడ : టీజీపీఎస్సీ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన గ్రూప్‌-3 పరీక్ష పేపర్‌-3 ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించిన పేపర్‌-3 ముగియడంతో అభ్యర్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. పట్టణంలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆయా కేంద్రా మొత్తం 7798మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా పేపర్‌-3 పరీక్షకు 2900మంది అభ్యర్థులు హాజరయ్యారు. 37శాతం మంది అభ్యర్థులు హాజరు కాగా 63శాతం అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు తెలిపారు.

ఏం ఘనత సాధించారో ప్రజలకు తెలపాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్



మాట్లాడుతున్న బడుగుల లింగయ్యయాదవ్

కొండమల్లేపల్లి : రాష్ట్రంలో 11నెలల గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏం ఘనత సాధించారో ప్రజలకు తెలిపి, విజయోత్సవాలు నిర్వహించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, సూర్యాపేట బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సోమవారం కొండమల్లేపల్లి పాల శీతలీకరణ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కల్యాణ లక్ష్మీతో పాటు పెళ్లి కానుక తులం బంగారం ఇస్తామని చెప్పి హామీని కనీసం ప్రస్తావించడం లేదన్నారు. ప్రతి మహిళలకు రూ.2500 ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రైతులను మాయ మాటలతో కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు లింగంయాదవ్, సత్యనారాయణ, యాదగిరి, వెంకటయ్య పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయం సందర్శన

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీ డౌన్ పార్కులోని అమ్మవారు(ముత్యాలమ్మ కాళికాదేవి)ఆలయాన్ని సోవామవారం ప్రముఖులు దర్శించారు. సోమవారం దేవాలయ కమిటీ చైర్మన్ ఎం.జనార్థన్ ఆధ్వర్యంలో కార్తీక భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభసభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వీరి వెంట హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ముఖ్యసలహాదారులు తిరుమలకొండ మోహన్‌రావు,తిరుమలగిరి(సాగర్) మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, కౌన్సిలర్లు రమేశ్‌జీ, ఈర్లరామకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెలంగాణ ప్రభుత్వ సంబరాలు



మాట్లాడుతున్న ఏపీఎం లక్ష్మీనారాయణ

త్రిపురారం : ఈనెల 19 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ సంబరాలను నిడమనూరు మండల వ్యాప్తంగా గ్రామాల్లో మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించునున్నట్లు నిడమనూరు ఏపీఎం లక్ష్మీ నారాయణ అన్నారు. సోమవారం తెలంగాణ సంబరాల కార్యక్రమంలో భాగంగా నిడమనూరు మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఇందిరా మహిళ శక్తి తెలంగాణ సంబరాల్లో భాగంగా సంఘాల్లో లేని మహిళలను సంఘాల్లో చేర్పించడం, ప్రమాద బీమా, రుణ బీమాపై మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. మహిళలను వ్యాపారాల వైపు మళ్లించుటకు బ్యాంకు రుణాలు వందశాతం గ్రౌండింగ్ చేయడం, డిసెంబర్ నుంచి ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలపై తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘మాలల సింహగర్జన’ జయపద్రం చేయాలి



హాలియా : సింహగర్జన కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

హాలియా : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సింహగర్జన సభకు అధిక సంఖ్యలో మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోలి సైదులు పిలుపునిచ్చారు. సోమవారం హాలియా పట్టణంలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన సింహగర్జన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వల్ల భవిష్యత్ కాలంలో మాలలకు విద్యాపరంగా, ఉద్యోగాల పరంగా, రాజకీయ పరంగా వెనుకబడిపోయే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. మాలల హక్కుల కోసం ఎస్సీ వర్గీకరణను, 29 జీఓను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో చేపట్టిన మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని కోరారు. మాల మహానాడు నాయకులు రెడ్డిమల్ల సురేష్, మండలి చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా సీనియర్ నాయకులు నామ లింగయ్య, జిల్లా కో చైర్మన్లు సైదులు, యాదగిరి, సురేష్, చెన్నయ్య, గోపాల్, వాసు, కోటయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల మహిళలకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తిరుమలస్వామి

వేములపల్లి (మాడ్గులపల్లి) : మాడుగులపల్లి మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తిరుమలస్వామి హాజరై కొత్త సభ్యులను చేర్చుకోవడంపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి లోన్ తీసుకొని మృతిచెందిన సభ్యులరాలికి లోన్ బీమా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా ప్రమాదబీమా సంఘ సభ్యులు తీసుకోని ప్రమాదవశాత్తు మృతిచెందినట్లయితే 18 -60 ఏళ్ల వరకు ఆ సభ్యురాలి కుటుంబసభ్యులకు రూ.10లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, ఏపీఓ నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, సీసీలు నాగయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లి శివారులో తమ వ్యవసాయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న స్థానిక సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు దారగాని వెంకటేశ్వర్లు సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాడపల్లి శివారులోగల సర్వే నంబర్ 483లో 1.24ఎకరాల భూమిని తాము 40ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, స్థానికంగా ఉన్న సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుందని వాపోయాడు. రెండు రోజుల క్రితం పరిశ్రమ తమ భూమిని లాక్కొనేందుకు గాను యంత్రాలతో వచ్చి తాము సాగు చేసిన పంటను ధ్వంసం చేసింది. తమ వద్ద ఉన్న పూర్తి ఆధారాలతో గతంలో కోర్టును ఆశ్రయించగా తీర్పు సైతం తమకు అనుకూలంగా వచ్చినప్పటికీ సదరు పరిశ్రమ యాజమాన్యం దౌర్జన్యంగా తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని బాధితుడు వినతిపత్రంలో కోరాడు. స్పందించిన ఎస్పీ వారం రోజుల్లో పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



హాలియా : కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్



పెద్దఅడిశర్లపల్లి : అంగడిపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు



త్రిపురారం : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

హాలియా : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఐకేపీ మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ఐకేపీ సెంటర్లలో విక్రయించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను పొందాలన్నారు. అనంతరం కొత్తపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ రఘుపతి రావు, ఏపీఎం కళావతి, సీసీలు చారి, సైదయ్య, ఏఈఓ నాగయ్య, నాయకులు బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, నాగిరెడ్డి, రఘుపతిరెడ్డి, షేక్ గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, చారి, కొండల్, క్రాంతి, నరేష్, శ్రీనివాస్ రెడ్డి, మట్టారెడ్డి, యేసు పాల్గొన్నారు.

19,641 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

మిర్యాలగూడ : మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 19,641 క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కొనుగోలు చేసిన 19,641 క్వింటాళ్ల ధాన్యంలో 18,798 క్వింటాళ్ల దొడ్డురకం ధాన్యం, 846 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం ఉందన్నారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

త్రిపురారం : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర వస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. సోమవారం నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం, బొక్కమంతల పాడు, నందికొండ వారిగూడెం గ్రామాల్లో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రంగశాయి రెడ్డి, పలు గ్రామాల నాయకులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలు లేని ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని, 17శాతం తోపు మ్యాచర్ వచ్చే విధంగా వడ్లను ఆరబెట్టుకొని కేంద్రానికి తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతుల వివరాలు నమోదు చేసిన రిజిస్ట్రర్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీటీసీఎస్‌ఓ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, సీఈఓ తిరుపతిరెడ్డి, ఏఈఓ మల్లేష్, మానిటరింగ్ అధికారి, రైతులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వరు అన్నారు.సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్, ఘనపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు డబ్బులు త్వరితగతిన రైతు ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డీటీసీఎస్ హన్మంతు వెంకటేష్‌గౌడ్, పీఏసీఎస్ అధికారులు ప్రభాకర్, మహేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

పెద్దవూర: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. కోసిన వెంటనే వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా ఇళ్ల వద్దనే ఆరబెట్టుకుని సరైన తేమశాతం వచ్చాకే తీసుకురావాలని పేర్కొన్నారు. ఏరోజు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆరోజే మిల్లులకు పంపించాలని సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీటీ శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, మనోహర్, ఏఈఓ స్వాతి, వెంకటయ్య పాల్గొన్నారు.

పేదలకు దాతల సాయం అభినందనీయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్, దాతలు

త్రిపురారం : ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ముందుకు వచ్చి సాయం చేయడం అభినందనీయమని అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ పేలపూడి బాలకృష్ణ అన్నారు. సోమవారం నిడమనూరు మండలంలోని బంకాపురం గ్రామంలో 67మంది దాతల నుంచి సేకరించిన రూ. 62వేలను కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బూడిద శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంత కాలంగా గ్రామంలో అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరిని చైతన్య పర్చుతూ పేద ప్రజలు వైద్యఖర్చులు అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నం చిన్న వెంకటేశ్వర్లు, బండారు రామయ్య, సైదయ్య, రాయపాటి శ్రీను, మదు కుమార్, శ్రీనివాస్, చిన్న సత్యనారాయణ, మధు, శ్రీను బుర్రయ్య, వెంకన్న, శ్రీను, కృష్ణ, వెంకటేశ్వర్లు, గోపాల్ రావు, లింగయ్య, రాజు, శేఖర్, బూడిద రవి, కృష తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాబా ఆలయ ద్వాదశ వారోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

డిండి : మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిర ద్వాదశ వారోత్సాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు సాయిబాబాకు 108కలశములతో మహాభిషేకం, సంస్థాన్‌హారతి, లక్ష్మీ గణపతి, సకల దేవత ప్రీతి హోమం, అష్టలక్ష్మి హోమం తదితర వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో భక్తి పాటలతో గ్రామ పురవీధుల గుండా నిర్వహించిన సాయి పల్లకీ సేవా కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహ, మలయ్య, పర్వత్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీదేవి, అనిత, కుమారి, రాజ్యలక్ష్మి, మాధవి మాధవి, సరస్వతి, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

త్రిపురారం : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపులో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపు గ్రామానికి చెందిన రైతు మూడావత్ బాలు వ్యవసాయంతో పాటుగా గేదెలను సాకుతున్నారు. గ్రామంలో వరి కొతలు కోయడంతో రోజు మాదిరిగానే గేదెలను మేత కోసం సమీపంలో ఉన్న పొలాలకు తోలుకెళ్లారు. గేదెలు మేత మేసుకుంటూ వ్యవసాయ పొలాలకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ స్తంభం వైపు వెళ్లింది. అప్పటికే విద్యుత్ మోటార్‌కు ఏర్పాటు చేసుకున్న కరెంట్ తీగ తెగి ఉండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే గేదె మృతి చెందినట్లు తెలిపారు. గేదెను నీలాయిగూడెం పశువైద్యశాల సిబ్బంది పరిశీలించి పంచనామా నిర్వహించారు. గేదె విలువ సుమారు రూ. 85వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

కేసులను ఉపసంహరించుకోవాలి

మిర్యాలగూడ : కొండగల్ నియోజకవర్గం లగచర్ల ఘటనలో ప్రభుత్వం లంబాడీ రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో సేవాలాల్ సేనా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు డి.ప్రకాశ్‌నాయక్ మాట్లాడుతూ లగచర్లలో లంబాడీ మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీఎం ఎనుముల తిరుపతిరెడ్డి అక్కడి ఎస్సీ, ఎస్టీలపై కులం పేరుతో దూషిస్తూ మాట్లాడినందున సుమోటోగా స్వీకరించి అట్రాసిటి కేసు నమోదు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాందాస్, మోహన్‌నాయక్, శ్రీనునాయక్, దస్రునాయక్, తులసీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

చింతపల్లి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండా శ్రీశైలం, కంబాలపల్లి ఆనంద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుర్మపలిలో సీపీఎం చింతపల్లి మండల 8వ మహాసభ నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వాలు పూర్తిగా గాలికి వదిలేశాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రాములు, లక్ష్మమ్మ, యాదయ్య, సర్దా ర్, పెద్దయ్య, బాలయ్య పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

డిండి : భవిష్యత్‌లో రాష్ట్రంలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటరమణ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సీపీఐ 100వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కోరుతూ ఆదివారం రాత్రి మండల పరిధిలోని చెర్కుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే నెల 26న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో సీపీఐ జెండా ఎగురవేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కనకచారి, జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనొద్దిన్, శైలేష్, వెంకటేశ్వర్లు, హన్మంతు పాల్గొన్నారు.